ప్రతి ఇంట 'మా నమ్మకం నువ్వే జగన్'

- సీఎం నమ్మకాన్ని నిలబెట్టండి
- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొడదాం
- 2024లో మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం



సచివాలయ గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, సమావేశానికి హాజరైన గృహసారథులు, కన్వీనర్లు

మదనపల్లె : వలంటీర్లు, ఏరియా గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించి, గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి మధ్య తేడాను తెలియజేసి వారితో ×మా నమ్మకం నువ్వే జగన్×అనిపించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం రామాచార్లపల్లె సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె మండలానికి సంబంధించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హబీబ్‌ఖాన్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ...కేవలం రెండుపేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను 100శాతం నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన మాట నిలుబెట్టుకున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రి, 30 ఏళ్లు అనుభవం అని గొప్పలు చెప్పుకునే ప్రతిపక్షనాయకుడు చంద్రబాబుకు ప్రజలకు మేలు చేసే ఆలోచన లేదన్నారు. అది గుర్తించిన ప్రజలు 2019 ఎన్నికల్లో జగనన్నను గెలిపించి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ నేటివరకు చెప్పినవాటికంటే అధికంగా, అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా పాలన సాగిస్తూ ప్రజల మనస్సుల్లో చెరగని స్థానం ఏర్పాటుచేసుకున్నారన్నారు. పార్టీకి ఓటువేయని వారికి పథకాలు మంజూరు చేయడమే కాకుండా ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయ గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి నమ్మకం, నమ్మకద్రోహానికి, సంక్షేమ పాలనకు, గత ప్రభుత్వ అసమర్థపాలనకు తేడాలను వివరించాలన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి కలిగిన సంక్షేమాన్ని తెలిపి, మంచి కలకాలం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని చెప్పి ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని చెప్పాలన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా పనిగట్టుకుని జగనన్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టి, ప్రజలకు మంచి, చెడులు వివరించి వారి నోటితోనే మా నమ్మకం నువ్వే జగనన్న అనిపించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు హబీబ్‌ఖాన్ మాట్లాడుతూ..పేదవాడికి ఏ ప్రభుత్వం మేలు చేసిందో.. ఏ నాయకుడి ప్రమేయం లేకుండా పథకాలన్నీ ఇంటివద్దకు అందుతున్నాయో.. అలాంటి ప్రభుత్వాన్ని తప్పక ఆశీర్వదించాలని, అది జగనన్న ప్రభుత్వమేనని ప్రజలందరికీ గృహసారథులు వివరించాలన్నారు. చంద్రబాబుకు మొదట్నుంచీ కాపీ కొట్టడమే అలవాటని, మహానేత వైఎస్సార్ పాదయాత్రను చంద్రబాబు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రను నారాలోకేష్ కాపీ కొడుతూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత అధికమని, వారి మీద జగనన్నకు నమ్మకం ఎక్కువన్నారు. అందుకే ప్రతి పథకంలోనూ మహిళలనే లబ్ధిదారులుగా చేశారన్నారు. గృహసారథులు వైఎస్సార్ సీపీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను భారంగా కాకుండా కసితో పనిచేసి టీడీపీ కుట్రలు, కుతంత్రాలను ప్రజలకు తెలిపి, వారిని ప్రజలే ఛీదరించుకునేలా చేయాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు కలిసికట్టుగా పనిచేస్తే దేవుడిదయ, ప్రజలందరి ఆశీస్సులతో 2024లో మళ్లీ జగనన్న ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోవచ్చన్నారు. ఐప్యాక్ ఇన్‌చార్జ్ సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గృహసారథులకు పంపిణీ చేస్తున్న కిట్‌బ్యాగ్‌లో విధి విధానాలపై కరపత్రాలు, స్టిక్కర్లు అందించామన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబయజమాని అనుమతితో స్టిక్కర్ అతికించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నందినితాజ్, పసుపులేటిరమణ, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, వెంకటరమణ, లక్ష్మీదేవి, గణేష్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పోతబోలునాగరాజ, బండిమనోహర్, సిద్ధలవేమారెడ్డి, ఇస్మాయిల్, బావాజాన్, నీరుగట్టిమేరీ తదితరులు పాల్గొన్నారు.

మంచికి మారు పేరు వైఎస్సార్‌సీపీ

రామసముద్రం: మంచికి మారుపేరు వైఎస్సార్ సీపీ అని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడుస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. బుధవారం రామసముద్రం శ్రీలక్ష్మీజనార్ధనస్వామి ఆలయ ఆవరణలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు బాధ్యతలు, విధులు గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ఆంధ్ర రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో 2024 ఎన్నికల్లో ముందుకెళ్లాలని సూచించారు.టీడీపీకి కంచుకోటగా ఉన్న రామసముద్రం మండల ప్రజలు తమ కుటుంబాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని, వారికి ఎల్లప్పుడూ తమ కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. మండల అభివృద్ధికి తాను ఎల్లప్పుడు ముందుండి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు హబీబ్‌ఖాన్ మాట్లాడారు. ఎంపీపీ కుసుమకుమారి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, మదనపల్లె మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, సత్యపాల్‌రెడ్డి, నాయకులు ప్రకాష్, విశ్వనాథరెడ్డి, గబ్బురిబాబు,కోలాహరినాథ్, క్రిష్ణప్ప, బోస్, రెడ్డెప్పనాయుడు, ఉదయ్‌శంకర్‌రెడ్డి, ఆది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల పనితీరుపై ఎమ్మెల్యే అగ్రహం

రామసముద్రం: తనపై దాడిచేసి గాయపరిచిన వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అరికెల పంచాయతీ చీమనపల్లెమిట్టకు చెందిన బాధితుడు సుధాకర్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు బుధవారం ఫిర్యాదు చేశాడు. సుధాకర్ మాట్లాడుతూ అరికెల పంచాయతీ చీమనపల్లెమిట్ట గ్రామస్తులు చిన్నప్ప, వెంకట్రమణ, వంశీకృష్ణలు గత నెల 13వ తేదీ భూతాగాదా విషయమై తనపై దాడి చేసి, తీవ్రరక్తగాయాలు చేయడంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు విచారించి వివరాలు సేకరించారే గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈనెల 6వ తేదీన ఫిర్యాదు చేసినా తనపై దాడి చేసిన వారిపై ఇంత వరకు కేసునమోదు చేయలేదని ఎమ్మెల్యేకు తన ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పోలీసుల పనితీరుపై మండిపడ్డారు. బాధితుడు సుధాకర్ ఫిర్యాదుపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. దీనిపై ఎస్ఐ రవీంద్రబాబు అప్పటికప్పుడే కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

కలికిరి: జూదరులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఏఎస్ఐ మాబు సాహెబ్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని గుట్టపాళెం కస్పా నందు జూదమాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం సీఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.21200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

కురబలకోట: మండలంలోని అంగళ్లు, ముదివేడులోని ఎరువుల దుకాణాలపై ఇంటర్నల్ స్క్వాడ్ టీమ్ ఏడీఏ (ఎస్‌సి) బి. దీక్షాకుమారి ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. అనుమతి లేని రూ.9 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఎఓ (ఎస్‌సి) కృష్ణవేణి, స్థానిక ఏఓ ఎస్. రాధ పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎడీఏ శివశంకర్

గుర్రంకొండ: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మదనపల్లె ఎడీఏ శివశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండలో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో స్టాకు, పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. గోడౌన్లలో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం ముందర తప్పనిసరిగా ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. కాలం చెల్లిన మందులు, ఎరువులు విక్రయించ వద్దని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు.ఏవో రత్నమ్మ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

తంబళ్లపల్లె: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో సంఘమిత్రలు, సీసీలకు ఫిజియోథెరపీ చిట్కాలపై ఫిజియోథెరపీస్టు సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు కండరాలు, కీళ్లనొప్పుల కోసం పెయిన్ కిల్లర్స్ వాడకంతో కలిగే అనర్థాలను వివరించారు. ఇంటిలోనే మానసిక ఒత్తిడి, కీళ్లు, కండరాళ్ళ నొప్పులు తగ్గించేందుకు ఫిజియోథెరపీ చిట్కాలు వివరించారు. ఏపీయం గంగాధర్, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

తంబళ్లపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని బ్యాంకు చైర్మన్ ఏఎన్ఎస్ ప్రసాద్ కోరారు. బుధవారం తంబళ్లపల్లెలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు బ్రాంచిని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే బ్యాంకును అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం ప్రసాద్, మేనేజర్ మోహన్, సరిత తదితరులు పాల్గొన్నారు.

18న అంగళ్లులో యవ్వనస్థుల కూడిక

కురబలకోట: మండలంలోని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో ఈనెల 18న యవ్వనస్థుల కూడిక నిర్వహిస్తున్నట్లు మందిర ప్రధాన పాస్టర్ విక్టర్ వేదనాయకమ్ బుధవారం తెలిపారు. శ్రీహరికోట సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ మాజీ జనరల్ మేనేజర్ ఆర్. వరప్రసాద్ ముఖ్య అతిథిగా వాక్యోపదేశం చేస్తారన్నారు. నీ వయస్సును బట్టి ఎవడను నిన్ను తృణీకరింపనియ్యకుము..విశ్వాసులకు మాదిరిగా ఉండుము..అనే అంశంపై వాక్యోపదేశం ఉంటుందన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించడమే ధ్యేయం


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు :ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, ముత్తరాసివీధి, సాయిబాబా గుడి వీధి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వివరాలు చదివి వినిపించారు. ఇంకా ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మత్తురాసి వీధికి చెందిన మల్లంగ్‌షా కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ. 13.79 లక్షలు లబ్ధి చేకూరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతోందని చెప్పారు. నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ఆర్బీల నిర్మాణానికి రూ. కోటి మంజూరైనట్లు తెలిపారు. మొత్తం 21 ఆర్బీలు నిర్మించనున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఎస్‌వి. చలపతి, హరిత, ఎంపీటీసీ జోహార్, నాయకులు షాకీర్, కాలనీ చిన్న, నాగరాజ, కళావతి, నాగభూషణం, ఉదయ్, ఆనంద్, శ్రీనాథరెడ్డి, మునీర్, అబీద్, అల్లాబక్షు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎడీఏ శ్రీకాంత్

గుర్రంకొండ: రైతులు చిరుధాన్యాలు, వరిపంటల సాగుపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఏడీఏ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండ రైతుభరోసా కేంద్రంలో (ఆర్బీకే)లో చిరుధాన్యాలు, వరి పంట సాగు విధానం, సస్య రక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ చిరుధ్యానాలైన రాగి, సజ్జ, సామ,ఊదలు, కొర్రలు, అరికెలు సాగు విధానంలో మెలకువలు పాటించాలన్నారు. వరి సాగు విధానంలో 19 గ్రాములు కార్బండిజమ్ ఒక లీటర్ నీటితో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా విత్తనం, సాగు ఖర్చులు తగించుకోవచ్చన్నారు. వరిలో కాలిబాటలు ప్రతి 200 మీటర్లకు 20 సెం,మీ కాలిబాటలు వదులుకోవాలన్నారు. వరినారుకు కొనలు తుంచి నాటడం వల్ల కాండం తొలుచు పురుగులు నివారించవచ్చన్నారు. వరిలో కలుపునివారణ కోసం ప్రిటలాక్లోర్ 600 ఎంఎల్ మందును 20 కేజిల ఇసుకతో కలిపి నాటిన రెండునుంచి మూడు రోజుల్లో చల్లాలన్నారు. కార్యక్రమంలో ఎవో రత్నమ్మ,ఎంపీఈవోలు మహేశ్వర్ నాయక్, మోగిత, రైతులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

కేవీపల్లె : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవులు అన్నారు బుధవారం గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ ఆవరణలో 120 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఆవరణలో శోభాయమానంగా నింపడానికి మామిడి, జామ, నిమ్మ, అల్లనేరేడు, మునగ, బొప్పాయి, పనస, ఉసిరి లాంటి పండ్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కలతో శారీరక, మానసికారోగ్యం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ శివయ్య, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ బి.వి. రమణ, అధ్యాపకులు భూపతి, రామకృష్ణ, సూర్యనారాయణరెడ్డి, రమణయ్య, రమాదేవి, అన్నపూర్ణ, సౌజన్య, వెంకటరమణ, హరి, మస్తాన్‌వలి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

రాయచోటి అర్బన్ : మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు వెంటనే పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు మద్రి సుమిత్ర డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నిరకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ మహిళలపై దాడులు, హింస, అత్యాచారాలు, అన్యాయాలు, లైంగికవేధింపులు, వివక్ష కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి, మద్యపానాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలంటూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామంటూ హెచ్చరించారు.

పట్టణ నూతన కమిటీ ఎంపిక

రాయచోటి పట్టణ మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షురాలిగా సంపూర్ణ, కార్యదర్శిగా సునీత, ఉపాధ్యక్షురాళ్లుగా అరుణ, సుబ్బమ్మ, సహాయ కార్యదర్శులుగా మల్లీశ్వరి, నవీబా, కోశాధికారిగా పద్మావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కలికిరి : విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక మహాత్మాజ్యోతిబాబా పూలే గురుకుల పాఠశాల ప్రత్యేకాధికారి, పీఆర్ ఎస్ఈ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే స్కూల్‌ను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.రూ. 1,42,345 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, ఈవో రవీంద్రరాజు, ఆలయ చైర్మన్ మాధవరం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో 180 రోజులు సంబంధించి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సహదేవయ్య, కృష్ణప్ప, అనురాధ, రాజేశ్వరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఆర్డీవో


పూజల్లో పాల్గొన్న ఆర్డీవో మురళి దంపతులు

మదనపల్లె సిటీ: సీటీఎం నలవీర గంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ కమిటీ నిర్వాహకులు ఆనందపార్థసారథి, పొగాకు వీరప్రతాప్, వెలుగు చంద్ర, సురేంద్రరెడ్డిలు ఆర్డీవోకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీవో దంపతులకు సన్మానం చేశారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ


కరాటే పోటీల్లో రాణించిన విద్యార్థులు

మదనపల్లె : బెంగళూరులో జరిగిన 8వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ కరాటే కుమితే విభాగంలో పట్టణానికి చెందిన భాష్యం విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. రెండోతరగతి చదువుతున్న వి.రెడ్డికుషాల్‌రెడ్డి, నాలుగో తరగతి చదువుతున్న వై.యక్షిత్‌కుమార్‌రెడ్డి ప్రథమబహుమతి సాధించారు. ఆర్.చరితేష్, తన్విక్‌రెడ్డి ద్వితీయ స్థానం సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రెండోస్థానం సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రామచంద్ర, ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సారా స్వాధీనం: నిందితుడి అరెస్టు

పీలేరురూరల్ : ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు పీలేరు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని రేగళ్ల పంచాయతీ, బోయపల్లెకు వెళ్ల క్రాస్ వద్ద పోలీసులు దాడులు నిర్వహించారు. బోయపల్లెకు చెందిన ఎస్. వెంకటరమణ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడిలో సెబ్ సిబ్బంది రాఘవయ్య, యోగానంద, సుధాకర్, సురేష్, గంగాభవాని పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

కలికిరి: జిల్లాలో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తమిళనాడు రాష్ట్రానికి చెందిన రైతులకు కేవీకే ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అవగాహన కల్పించారు. కేవీపల్లి మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతు శివ సాగు చేసిన మామిడి తోటను పరిశీలించారు. అమినాల్ పిచికారీ, పండు ఈగ బుట్టల ప్రాముఖ్యత, కొమ్మల కత్తిరింపుల గురించి వివరించారు. అనంతరం కేవీకే కార్యాలయంలో సేంద్రియ వ్యవసాయం, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శాస్త్రవేత్తలు వారికి వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు జ్యోతి, పీరు సాహెబ్, మాధురి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీజనార్ధనస్వామి శయనోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్ధనస్వామి బ్రహ్మోరథోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారికి శయనోత్సవం నిర్వహించారు. ఉదయం యదావిధిగా ప్రత్యేకపూజలు , పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానఅర్చకులు పార్థసారధిభట్టర్, కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ, రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మదనపల్లెలో చైతన్యయాత్ర ముగింపుసభ

మదనపల్లె : బహుజన్‌సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర ముగింపుసభ ఫిబ్రవరి 20న మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతంకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో రాజ్యాధికార చైతన్య యాత్ర ముగింపుసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతంకుమార్ మాట్లాడుతూ.. బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జనవరి 26న పాడేరు నియోజకవర్గం నుంచి మొదలైన రాజ్యాధికార చైతన్యయాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ 20న మదనపల్లెకు చేరుకుని ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. సభకు ముఖ్యఅతిథులుగా బీఎస్పీ రాజ్యసభసభ్యులు రాంజీగౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, రాష్ట్రకమిటీ సభ్యులు విచ్చేస్తారన్నారు. బీఎస్పీ అభిమానులు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సహదేవ, బాలాజీ, పునీత్, శ్రీనాథ్, రమణ, శివ, శ్రీనివాసులు, మహేష్, సురేష్, పెద్దోడు, హరీష్, ప్రశాంత్, కిరణ్, దేవి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

తంబళ్లపల్లె: రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) కలెక్షన్ సెంటర్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి(డీహెచ్‌వో) రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో పర్యటించారు. రూ.15లక్షలతో నిర్మిస్తున్న ఎఫ్‌పీవో కలెక్షన్ సెంటర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని హార్టికల్చర్ అధికారిణి తేజశ్వనికి సూచించారు. సీఈవో ప్రభావతి, ఎఫ్‌పీవో అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి నగదు ఇస్తున్న తహసీల్దార్, డీలర్లు

ములకలచెరువు: మండలంలోని మద్దినాయునిపల్లె పంచాయతీ కొండ్లమాలపల్లెకు చెందిన డయాలసిస్ బాధితురాలు సి. రవణమ్మకు రేషన్ డీలర్లు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. రూ. 25 వేల నగదును తహసీల్దార్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆమెకు అందించారు. మెరుగైన వైద్యం కోసం బాధితురాలికి ఆర్థికసాయం అందించినట్లు తహసీల్దార్, రేషన్ డీలర్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లు పంచాయతి ఉయ్యాలవారిపల్లికి చెందిన వెంకట్రమణారెడ్డి (40) అకస్మికంగా మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయంగా మృతుడి భార్య రామలక్ష్మమ్మకు సర్పంచ్ అనసూయమ్మ, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డిలు రూ.10 వేల నగదును అందజేసారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ సిద్ధార్థ ప్రభంజనం


విద్యార్థి షాకీబ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటివిడత ఫలితాల్లో జాతీయస్థాయిలో వెంకటరెడ్డి శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల అన్నమయ్యజిల్లాలో మొదటి రెండుస్థానాలు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఏఓ హేమంత్‌కుమార్ తెలిపారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.మహమ్మద్ షాకీబ్ 98.5739 పర్సంటైల్‌తో మొదటిస్థానాన్ని, ఐ.రుషికేష్‌రెడ్డి 95.9741 పర్సెంటైల్‌తో రెండోస్థానాన్ని సాధించారన్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్, ఏఓ అభినందనలు తెలిపారు.

గంగమ్మ జాతరకు మెరుగైన ఏర్పాట్లు

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మ జాతర ఈనెల 21, 22వ తేదీలలో జరగనుంది. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు ,ఆలయ సిబ్బంది త్వరితగతిన ఏర్పాట్లను పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివశంకర్ రెడ్డిలతో కలిసి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి బుధవారం అనంతపురం గంగమ్మ దేవతను దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర ప్రాంగణంలో జరుగుతున్న పనులపై ఆరాతీశారు. జాతరకు వచ్చే భక్తులకు ముందస్తుగా తాగునీటి సమస్య లేకుండా చేతి పంపులకు మరమ్మతులు చేయాలని, మోటార్ల రిపేర్లను చేయించాలని సూచించారు. అదనపు విద్యుత్ ట్రాన్సుఫార్మర్లను ముందస్తుగా ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ బాల సుబ్రమణ్యం, పూజారులు సుబ్బయ్య, రెడ్డిశేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.